# రాత్రి ఒంటిగంట

రాత్రి ఒంటిగంట అవుతుంది. అప్పుడే చిన్నవానపడి వెలిసిందిగాని యింకా తుప్పర్లు పడుతూనే వున్నాయి. గాలి కరుస్తున్నట్టు వీస్తూంది. చలి ఎక్కువగా వుంది.

నిర్జనపూరు ఒక చిన్న రైల్వేస్టేషను. రైల్వేవాళ్ళ ఉపయోగానికి దేనికోకట్టిన స్టేషనుగాని, నిజానికి అక్కడ దాని అవసరం కనిపించదు. నరసంచారం అంతగా వుండదు. అడవి మధ్య నిర్జీవంగా భయంవేస్తున్న ఆ ప్రదేశంలో నాలుగైదు స్టాఫ్‌క్వార్టర్సు వున్నాయి. అంతే.

ఒక గూడ్సుబండికి త్రూలైన్ క్లియర్ యిచ్చేసి ఆబండి రాకకోసం యెదురుచూస్తూ చిన్నమేష్టరు పచ్చదీపం పట్టుకుని పైని నిలుచున్నాడు. జమాదారు, పాయింటువాళ్ళూ యెవరిపనిలో వారున్నారు.

ఒక రైలు ఆచీకటిని చీల్చుకొంటూ పెద్ద హెడ్ లైట్ తో, ఆ నిశ్శబ్దాన్ని భేదిస్తూ, పెద్ద అరుపుతో రాక్షసి వదిలిన చుట్ట పొగలా పొగ వదలుతూ. కొండ చిలువలా కొంత దూరం వచ్చి, స్టేషన్‌కి చేరకుండానే ఆగిపోయింది. ఆ బండి తిన్నగా ఆగకండా వెల్లిపోవలసింది! ఆ స్టేషన్‌లో దానికి పనిలేదు కాబట్టి. కాని—డ్రైవరు పరిగెట్టుకుంటూ గాభరాగా స్టేషన్ వైపు రావడంతో అందరికీ అనుమానం వేసింది.

ఆ డ్రైవరు 'మేస్టారూ! అవుటరు సిగ్నలుకూ, హోం సిగ్నలుకూ మధ్య ఓ మనిషి బండిక్రిందబడి చచ్చేడని చెప్పేడు పిడుగులా! అది వినగానే చిన్న మేష్టరు కంగారు పడ్డాడు.

అక్కడున్న వాళ్ళందరూ ఆచోటుకి వెళ్ళేరు. మొగ వాడు, 38 ఏళ్ళ ప్రాంతంవాడు పట్టాలమీద పడివున్నాడు. పీకలేని మొండెం ట్రాక్ కి కుడిప్రక్క పడివుండి. తలకాయ పూర్తిగా తెగిపోయి రెండు లైన్లకీ మధ్య బోరిగిళ్ళావుంది. తలమీద ఒక గాయంవుంది. రక్తం యెండిపోయింది. చిన్న మేష్టరు వీలయినన్ని వివరాలు, ట్రైన్ నెంబరు, గార్డు డ్రైవర్ల పేర్లు, యింజన్ నెంబరు, మైలు నెంబరు యివన్నీ రాసుకోని. బండిని పోనిచ్చాడు. శవాన్ని యే జంతువులూ యెత్తుకుపోకుండా ఒక గ్యాంగు మనిషిని కాపలావుంచి స్టేషన్ కి వచ్చేశాడు.

తర్వాత దగ్గరలోవున్న జి.ఆర్.ఒ.కీ లోకల్ పోలీస్ కీ, యింకా ఆ సంబంధంవున్న ఆఫీసర్లందరికీ వార్తపంపాడు.

తెల్లవారేసరికి జీప్‌లమీద, రైళ్ళమీద వచ్చి ఆ స్టేషన్‌లో దిగారు ఆఫీసర్లు, పోలీసులూ. మొదట స్టేషన్ స్టాఫ్‌ని అడిగి వివరాలు తెలిసికోని, సైట్ దగ్గరకి వెళ్ళేరు. ఎవరికి వీలయిన కోణాల్లోంచివారు చూశారు. ఫోటోగ్రాఫరు ఫోటోలు తీశాడు. పోలీసు ఇన్స్పెక్టరు కర్ర ఆడిస్తూ ఆ చుట్టు ప్రక్కలా ట్రాక్ పక్కా చూస్తూ ఏవో ప్రశ్నలు అడుగు తున్నాడు. డాక్టరు వచ్చి పరీక్ష చేస్తూ—

"చూశారా! ఇది 'రన్ ఓవర్' అన్నారు గాని

కాదు" అని అన్నాడు. అదివిని అందరూ విస్తుపోయారు. పోలీసు ఇన్స్పెక్టరు ముందుకి ఆతృతతో వచ్చి— 'మరి!' అన్నాడు!

"అసలు బండిక్రింద పడనేలేదు. చూడండి యీ రైలును మీదగాని, క్రింద స్లీపర్లమీదగాని రాళ్ళమీదగాని ఒక్క నెత్తురుబొట్టు లేదు. మరోవిషయం— పీక చక్రం క్రింద పెట్టి నట్టయితే ఆ పీక కొంతవరకూ అంటే చక్రం ఎంత మందంగా వుంటుందో— నాలు గయిదంగుళాల వెడల్పున ముద్దముద్దగా నలిగిపోయి వుండాలి. కాని అలాలేదు. ఎవరో కత్తితో సావ కాశంగా కోసి విడదీసి యిలా పడేసినట్టు అనిపిస్తుంది. ఆ కొయ్యడం కూడ యిక్కడ జరిగినట్లు లేదు. కాకుంటే రక్తం జాడలు వుండును. ఏమంటారు?" అన్నాడు డాక్టరు.

దాంతో ఇన్స్పెక్టర్కి చురుకుపుట్టి "కరెక్ట్ నాకూ అలాగే అనిపించింది! ఇంకా నిర్ధారణకి రాలేక తటపటా యిస్తున్నాను? యింకోటి కనిబెట్టారో లేదో బండికింద కావా లని తలపెట్టినవాడయితే, తల తెగాక కొంతసేపయినా గింజు కోకతప్పదు. ఈ శవం చూడండి! మొండెం సాష్టాంగపడి బోరిగిళ్ళా చెక్కుచెదరకుండా వుంది. ఆ తలకూడా అలాగే వుంది! తొడుక్కున్న చెప్పులుకూడా కాళ్ళనించివేరుకాలేదు యిది చాలావింత! — అనగా హంతకుడో, హంతకులో— ఈ విధంగా కోసి, అమర్చి వెళ్ళిపోయేరు. అలా చేస్తే బండి క్రిందపడి తెగిపోయాడని అనుకుంటే పీడ వదలిపోతుందని వాళ్ళవూహ" అంటూ ఇన్స్పెక్టరు తలదగ్గరికి వెళ్ళిచూ శాడు. తలమీద ఒక గాయం కనిపించింది.

శవం గుర్తుపట్టబడింది. అతనిభార్య, తదితర బంధువులూ వచ్చి, "మొన్నరాత్రి మూడు గంటలబండిలో ప్రక్కవూరి సంతకి వెడతానని, స్టేషన్ దూరంకాబట్టి రాత్రి ఎనిమిదింటికే బయలుదేరి యింటినుండి వెళ్ళిపోయేడని, ఆతర్వాత యీ ఘోరం తెలిసిం"దని చెప్పారు.

చుట్టుప్రక్కల ఏదైనా గ్రామాలున్నాయేమో అని కనుక్కోగా, ఆ స్టేషన్‌చుట్టూ రెండు మూడు మైళ్ళకైవారంలో మూడు నాలుగు పల్లెటూళ్ళు వున్నట్లు తెలిసింది. ఇంకేం పోలీసుమూక ఆవూళ్ళమీదపడింది. వీళ్ళని ఆ ప్రజలు యెంత వింతగా చూశారో, ఆ వూళ్ళూ అంతేవింతగా వున్నాయి. అందరూ వ్యవసాయం వృత్తిగా పెట్టుక బ్రతుకుతున్నారు. ఏవూళ్ళోనూ ఒక బీడీదుఖాణమైనా లేదు. అక్కడ మనుష్యుల వళ్ళమీద సరిగ్గా బట్టలైనా లేవు. ఆ చనిపోయిన ఆసామీవుండే వూళ్లోకిపోయి ఇళ్ళని, మనుష్యులను సోదా చేసి 'ఆరా' తీయ ప్రయత్నించారు. ఆ కుటుంబం పోలీసులని చూచి, మరీ బెంబేలెత్తి పోయేరు, మరీ గోలుమన్నారు. తాపీగా నిలదీసి అడిగేసరికి ఒక చిన్నవిషయం తేలింది.

స్టేషన్‌మాష్టరు మూర్తికి, ఆ చచ్చినవాడికిన్నీ స్నేహమనీ, ఆ స్టేషన్‌మాష్టరికి బాగా తాగుడు అలవాటుందనీ యీ వూళ్లో త్రాగేవాళ్ళతో ఇతనికి జోక్యంవుందనీ అందరినీ తీసుకువెళుతూ, కలిసి తిరుగుతూ వుంటాడనీ యీ చనిపోయిన ఆసామీకి, ఆ మేష్టరికి ఒకనాడు యేదో చిన్న జగడం వచ్చి మాటామాటా 'అనుకోగా స్టేషన్‌వైపు రావా?' అని

ఆ మేస్టేరు అన్నాడనీ, అంతకు మించి విరోధం ఎవ్వరితోనూ అతనికి లేదనీ తెలిసింది.

త్రాగుడు కొద్దిగా అలవాటున్నా, వాళ్ళతో పరిచయంవున్నా ఖూనీచేసేంతటి ఖర్మంగాని, వైషమ్యంగాని తనకు లేదనీ, మాటమీద మాటగా ఆరోజున వాడిని అలా కోపంతో అన్నా తర్వాత మళ్ళీ యధాప్రకారంగానే స్నేహంగా వున్నామనీ, ఆ స్టేషన్ మాష్టరు చెప్పుకొన్నాడు.

ఒకనాడు నిర్జనపూరు స్టేషన్‌లో అందరూ చూస్తూండగా టిక్కెట్టులేదని ఒక ముష్టివాడిని మధ్యాహ్నం బండీలోంచి టిక్కెట్టు కలెక్టరు దింపేశాడు. వాడు నెత్తీనోరూ బాదుకుంటూ గోలపెడుతూ యెవ్వరికీ తోచనివ్వకుండా స్టేషనంతా అరుస్తూ వెయిటింగ్ షెడ్‌లోకివచ్చి గొణుక్కుంటూ కూర్చున్నాడు.

ఆ ముష్టివాడిదగ్గర ఒక చిరిగిన గోనెసంచీవుంది. అందులో ఏముందో! సందడి తగ్గాక ఆ ముష్టివాడు మరొకణ్ణి 'దగ్గిర యేమైనా వుళ్ళున్నాయా' అని కనుక్కున్నాడు. 'నీ కివన్నీ యెందుకంటే' నవ్వుకుంటూ బాబూ మరిక్కడేం తినేదీపూట' అని జవాబు చెప్పేడు. అలాగే యేవో కబుర్లు చెబుతూ వాళ్ళు విసుక్కుంటున్నా అడుగుతూ, ఎటో వెళ్ళినట్టేవెళ్ళి మళ్ళీ చీకటి పడకుండానే తిరిగివచ్చి ఆ షెడ్‌లోనే మఖాంపెట్టి పడుకున్నాడు.

రాత్రి పదిఅయివుంటుంది. వెన్నెలరాత్రేమో అల్లంత దూరంలోవున్న మనిషినికూడా పోలిక పట్టవచ్చు. ఆ సమయంలో స్టేషన్‌మాష్టరు మూర్తి లైనుప్రక్కనుండి వెళు

తుండడం కనిబెట్టాడు మన ముష్టివాడు లేచాడు. ఆ మాష్టరుకి తెలియకుండా పిల్లి అడుగులువేస్తూ కొంచెం దూరంలోంచి వెంబడించి వెళ్ళాడు.

మరునాటి రాత్రి పదిగంటల ప్రాంతంలో ఒక జీప్ కారు వచ్చి స్టేషన్ ముందు ఆగింది. స్టేషన్ లోంచి యెవరూ బయటనువచ్చి చూడక మునుపే ఆకారులోంచి యిద్దరు వ్యక్తులు దిగారు. సూటుతోవున్న ఆసామీ తిన్నగా స్టేషన్ వైపు నడిచాడు. రెండో ఆసామీ క్రితంరోజు వెళ్ళినట్టే లైను ప్రక్కగా ఔటర్ సిగ్నల్ వైపు గబగబా నడుస్తూపోయేడు.

సూటుగలవ్యక్తి స్టేషన్ లోపలికిపోయి చిన్నమేష్టర్ని పలకరించాడు.

'నేను సేఫ్టీ ఇన్ స్పెక్టర్ని, ఇన్ స్పెక్షన్ కి వచ్చేను!' అన్నాడా క్రొత్త వ్యక్తి. అతనెవడో కొత్త ఆఫీసరులాఉన్నా మొహం చూసింది కాకపోయినా యిలాటి వాళ్లని డిపార్టు మెంటు అకస్మాత్తుగా అప్పుడప్పుడు నియమిస్తూండడం అలవాటు కాబట్టి చిన్న మేష్టరు కంగారు పడలేదు.

"స్టేషన్ మాష్టర్ని పిలుస్తారా?" అని అతనడిగాడు.

'అలాగే' అంటూ ఒక పోర్టరుని పంపేడు స్టేషన్ మేష్టరు యింటికి.

అప్పుడే ఎక్కడికో బయలుదేరుతున్న మేష్టరు విసుక్కుంటూ విధిలేక వచ్చాడు అపన్ కి. చిన్నమేష్టరా వ్యక్తిని పరిచయం చేశాడు. అపన్ మాస్టరావ్యక్తిని విష్ చేస్తూ క్రొత్తగా చూశాడు.

"నేను ఈ డిస్ట్రిక్టుకు క్రొత్తవాడిని. యివాళలోగా ఈ

డివిజనంతా సర్ప్రైజ్ చెక్ చేయవలసి ఉంది. ఏదీ మీ ట్రయిన్ సిగ్నలింగ్ రిజిస్టరూ, తత్తిమ్మా రికార్డులూ యివ్వండి" అని అంటూ తణిఖీచేయ మొదలెట్టాడు స్టేషన్ మాస్టర్ని వదలకుండా.

అటు లైనువెంట పోయిన మనిషి తిన్నగా వెళ్ళి పరిచయం వున్నట్టు ఆ గోర్జిలోకి పోయి అక్కడ చదునుగా చెక్కబడినచోటులో ప్రక్కవాటుగా నుంచున్నాడు. ఎవరి కోసమో. కొంతసేపయ్యాక ఒక స్త్రీ దగ్గరగా వచ్చి, ఆ క్రొత్త వ్యక్తిని చూచి గతుక్కుమని వెనకడుగువేసింది.

"అడిగినవాటికి జవాబు చెప్పు! నేను పోలీసువాడ్ని. సరిఅయిన జవాబిచ్చావా ఫరవాలేదు! లేదా నిన్ను జైలుకి పంపిస్తాను!" అన్నాడతను గట్టిగా. ఆమె కొంచెం భయపడింది.

"ఇక్కడి కెందుకు వచ్చావు నీ పేరేమిటి?" అడిగాడతను.

"నాపేరు కాంతం" అందామె వణకిపోతూ.

"ఆ స్టేషన్మాస్టర్ కోసం వచ్చేవుకదూ!"

అది విని ఆమె మాట్టాడలేదు. సిగ్గుతోను, కంగారుతోనూ తలవంచుకుంది.

"నీ కెవరైనా ఉన్నారా! అంటే భర్త వగైరా?"

భర్త ఈమధ్యనే రైలుకిందపడి చనిపోయారు.

"నీకు స్టేషన్మాస్టర్తో సంబంధం ఎన్నాళ్ళబట్టీ వుంది?"

ఆమె మాట్లాడలేదు.

"కాంతం! నువ్వు చెప్పకపోతే రహస్యాలు దాగు తాయని అనుకోవద్దు. ఆరాత్రి నువ్వు స్టేషన్ మేష్టరుకోసం యిక్కడికి వచ్చావ్. నీ వెనకే నీకు తెలియకుండా నీభర్త వచ్చాడు. తర్వాత యేంజరిగిందో నిజంచెప్పు! చెప్పకపోతే అనవసరంగా జైలుకెళ్ళాల్సి వస్తుంది."

"ఆనాటిరాత్రి యిలాగే నేనూ మేష్టరుగారూ ఇక్కడికి వచ్చాం.

కొంతసేపటికి అదిగో ఆదిబ్బమీదనుండి మా ఆయన కర్రపెట్టుకు గంతి పులిలాగ వచ్చి మాష్టరుగారిని కొట్ట బోయేడు. ఇంతలో అదేంచిత్రంమో మేంయిద్దరం ఆశ్చర్య పడుతూండగా మరొకమనిషి యెవరో గభాలునవచ్చి ఆదిబ్బ మీదనుండే మాఆయన తలపై కొట్టేసి పారిపోయాడు. మా ఆయన పడిపోయేడు. మాయిద్దరికీ యేంచెయ్యడానికీ తోచ లేదు. ఇంకా అక్కడేవుంటే యేంవస్తుందోనని మాష్టరుగారు స్టేషన్‌లోకి, నేను మాయింటికీ పరుగెత్తుకుపోయాం."

"ఇది నమ్మతగ్గ కథేనా?" అన్నాడా మనిషి.

"కథకాదు బాబూ నిజం! ఇంతకన్నా, మీతోడు నేనేం ఎరగను" అందామె.

"సరే! నువ్వింక వెళ్ళు. ఇక్కడ యింకా వుండడం మంచిదికాదు" అని అతను వెనక్కితిరిగాడు.

స్టేషన్‌లో నూటుమనిషి యింకా ఆస్టేషన్ మాష్టర్ని వదలలేదు.

అంతలో అక్కడ కాంతాన్ని కలిసివచ్చిన వ్యక్తి

లోపలికివచ్చి ఒక కాగితం లోనున్నఇన్‌స్పెక్టర్‌కి యిచ్చాడు. అతడా కాగితంచూసి—

'మాస్టరు గారూ! మిమ్మల్ని ఎరెస్టుచేస్తున్నాం!' అన్నాడు అకస్మాత్తుగా. పిడుగులాంటి ఆ మాటవిని స్టేషన్ మాస్టర్ కంగారెత్తిపోయి ఏమీ తోచక "ఎందుకు?" అని అడిగాడు.

"మాస్టరుగారూ! నేను మీ ఆఫీసర్నిగాను. మేమిద్దరం పోలీస్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్లం. ఒక విషయంమీద అనుమానం కలిగి ఈ రాత్రి మీరు కాంతం కోసం వెళ్లబోయే ప్రయత్నాన్ని ఆపేయడానికి ఈవిధంగా వేషంవేస్తేనే గాని జరగదని నేను మీ ఆఫీసరుగా వచ్చేను. ఈలోగా ఇతను మీరు రోజూ వెళ్ళేచోటికి వెళ్ళి కాంతాన్ని కలుసుకుని విషయం అంతా తెలుసుకుని చక్కా వచ్చాడు" అన్నాడతను.

"ఇంతవరకు జరిగినతర్వాత అబద్ధాలాడి ప్రయోజనం లేదు. నేను ప్రమాణపూర్తిగా జరిగింది చెబుతున్నాను వినండి!' అని ఆస్టేషన్ మాస్టర్ కాంతం చెప్పినట్టే చెప్పాడు. కాని, ఆ పోలీస్ అసిస్టెంటు ఇన్‌స్పెక్టర్‌కి నమ్మకం కలగలేదు.

"మాస్టరుగారూ! అబద్ధాలు ఆడకండి! ఇలాటివి దాగేవి కావు. పాపానికి ప్రాయశ్చిత్తం తప్పదు. మీరేమయినా చెప్పుకోవలసిఉంటే కోర్టులో చెప్పుకోండి! మిమ్మల్ని ఎరెస్టుచేయక తప్పదు. మీరే హత్యచేసినట్టు మాదగ్గర ఋజువు వుంది. త్వరలో మా ఇన్స్పెక్టరుగారుకూడా వస్తారు"

అని అంటుండగా పోలీస్ ఇన్‌స్పెక్టర్ నలుగురు పోలీసుల తోను, ఒకస్త్రీతోను, ఒకపురుషునితోనూ అక్కడికి వచ్చాడు.

అసిస్టెంట్లు ఇద్దరూవచ్చి ఇన్‌స్పెక్టర్‌కి శాల్యూట్ చేశారు.

"మేస్టరుగారిని విడిచిపెట్టండి. అసలువాళ్ళను నాతో పట్టుకువచ్చాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్ చంద్రం. అదివిని అందరూ ఆశ్చర్యపోయారు.

"రక్షించారు బాబూ! అమాయకుడ్ని ఆజన్మాంతం మీకు కృతజ్ఞుడిని" అని చంద్రంచేతులు పట్టుకుని అభినందిస్తూ, "మిమ్మల్ని యెక్కడో చూచినట్టుంది" అన్నాడు.

"ఎక్కడో యెప్పుడోకాదు. యిక్కడే నిన్న మధ్యాహ్నమే. ముష్టివాడి వేషంలో చూశారు. ఇక్కడికి వచ్చినప్పటినుండి అందరి సంగతులూ ఒకకంట కనిపెడుతూనే వున్నాను. రాత్రిపూట మీరు లైనుమీరించి నడిచివెళుతూండడం చూచి అనుసరించి విషయం ఏమిటో గ్రహించాను. అప్పుడు నేనుకూడా ఆమె మోజుమీద మీరే యీ హత్యచేసేరేమోనని అనుమానించకపోలేదు. కాని తరువాత యీ చుట్టుప్రక్కల ఊళ్ళన్నీపోయి అందరిదగ్గరా సాధ్యమయినన్ని విషయాలు గ్రహించేను. అప్పుడే కాంతం భర్త బాగా తాగుతాడనీ, ఎల్లప్పుడూ యెదురుగుండా వున్న ఆ పల్లెటూరిలో ఉంటాడనీ, కాంతంకీ, మీకూ సంబంధం ఉన్నట్టే అతనికీ ఆఊరిలోవున్న చిన్నమ్మ అనే ఆమెకీ సంబంధం వుందనీ తెలుసుకున్నాను.

అప్పటినుండీ ఈ హత్యకిగల కారణాలు నేనూహిం

చడం మొదలుపెట్టేను. కాంతం భర్తఅనగా నారాయణప్ప మీకూ కాంతంకుగల సంబంధం తెలిసి మిమ్మల్ని చంపడానికి అక్కడికి వచ్చివుంటాడనీ, కాని మరొకవిధంగా జరిగి తనే వచ్చివుంటాడనీ తోచింది. ఎందుచేతంటే మీరు కాంతాన్ని కలుసుకోడానికి వెళ్ళినప్పుడు యేలాంటి ఆయుధమూ వెంట తీసుకువెళ్ళరు. పైగా నారాయణప్ప తలమీద వెనకభాగాన దెబ్బతగిలివుంది. మీరు కొడితే ముందుప్రక్క తగిలివుండాలి. పైగా అకస్మాత్తుగా అనుకోకుండా మీదకి ఆయుధంతో వచ్చిన వ్యక్తిని కొట్టగలగటం అసంభవం. అందుచేత నాకు మరొక అనుమానం కలిగింది. నారాయణప్పకి చిన్నమ్మకీగల సంబంధం తెలిసి నారాయణప్ప తలపెట్టినట్టే చిన్నమ్మకి సంబంధించినవాడు నారాయణప్పని హతమార్చడానికి పూని వుండవచ్చునని ఊహించాను.

ఈ ఊహమీద పరిశోధన ప్రారంభించాను. దానిమీద చిన్నమ్మవుండే వూరికి మొదట పోలీసుల్ని పంపి అలజడి లేవదీశాను. దొంగతనంగా చిన్నమ్మ యింటికివెళ్ళి వారిలో కలిగే మార్పుల్ని జరగబోయే విశేషాల్ని కనిపెడుతున్నాను. నిజంగా వాళ్ళకా హత్యతో సంబంధంవుంటే పోలీసులు చేసిన హడావుడికి తప్పకుండా వాళ్ళు భయపడతారని, వారిలో యేదోఒక మార్పురాక తప్పదని నావూహ.

ఈ ఆలోచనతో చిన్నమ్మయింటికి వెళ్ళేను. గుమ్మం యెక్కుతూ ఠక్కున ఆగిపోయాను. లోపలనుండి యేవో కేకలు వినవస్తున్నాయి. చెవులు రిక్కించి వినసాగాను.

"నిండుప్రాణం తీశావు! నీచేతులుపడ! నిన్నా భగ

వంతుడు సూత్తాడులే" అని ఆడకంఠం.

"ఏటేవ్ ఒద్దంటే మళ్ళీ ఆపూసే యెత్తుకుంటావ్! అసలు నిన్నే చంపేసి వుండాల్సింది రంకులంజా! నీ మొఖానికి ఆడ్ కడా! నువ్వు మంచిపని చేసినట్టు నన్నంటావ్" త్రాగిన మగకంఠం.

"నువ్వేంటి మా గొప్పనిజాయతీగా బ్రతుకుతున్నావని? ఈచ్చనం యెల్లిపోతాను. నన్నాగ్గీ. మళ్లీ పెద్ద కబుర్లుచెబుతావ్! ఎందుకంత భయం! నన్నాగ్గేస్తే అసలుసంగతంతా చెప్పేత్తాననా!... పమానంచేసి సెప్పమంటే నేచెప్పేస్తా. నా కేటిభయం నా మనసిచ్చినోణ్ణి సంపేసేవు! నేనుంటేయేటి, సస్తేయేటి! అదేదో చెప్పేసే సత్తా."

"ఏటేటీ నిన్ను ప్రాణాలతో ఒగ్గుతానటే. నిన్నీకుణం సరికేత్తా?"

అంతలో లోపల్నించి కేకలు వినబడేసరికి నేను పిస్తోలుతో తలుపులు తోసుకుని లోపలికి వెళ్ళాను. నన్ను చూడగానే వాడు పారిపోడానికి ప్రయత్నించాడు. కాని నేను విజిల్ వూదగానే పోలీసులువచ్చి వాడికి బేడీలు తగిలించేశారు" అని చంద్రం తనతో తీసుకువచ్చిన చిన్నమ్మని, ఆమె భర్త సన్యాసిని చూపించాడు.

న్యాయస్థానంలో చిన్నమ్మ యీవిధంగా చెప్పింది:

"నాకూ నారాయణప్పకీ సంబంధం వుండటం నిజమే! ఆ డెప్పుడూ మా వూళ్లోనే, మాయింటికాడే వుండేవోడు. ఆడికీ మాసన్నాసికీ మంచి స్నేహం ఉండేది. కొన్నాళ్లకి మాసంగతి సన్నాసికి తెలిసిపోయింది. మా ఇద్దర్నీ

చేంపెత్తానని బయపెట్టేడు. అంటే నే చెప్పేనుకదా నారాయణప్పతో తెగిచిపోతానని. మరేటనుకున్నాడో యేటోగాని అప్పటి కూరుకున్నాడు. మేమిద్దరం మరేఅడ్డులేకుండా పబ్లిగ్గా వుండేవాళ్లం. కాని యీచన్నాసి ఒకనాడు నారాయణప్పతో పెద్ద జట్టీఆడి, ఆడిని బాగాతన్ని పంపేశాడు. 'నీప్రాణంతీత్తా మళ్లీవచ్చావంటే' అని బయపెట్టేడు. అయినా నెక్కసేయక నారాయణప్ప ఒకటి రెండుసుట్లు ఒచ్చి యెల్లాడు.

ఒకనాడు రేతిరి పది అవుద్ది. నారాయణప్పని పట్టుకొని తీసుకొచ్చాడు యింటికి. – ఆడ్ని చూసేసరికి నాకు బయమేసింది. తలనిండా రక్తం కారుతోంది. ఏటయిందంటే ఎవడో కొట్టేసినాడు తల పగిలింది. చూసి తీసుకొచ్చానని చెప్పాడు సన్నాసి. నలుగురిని పిలుద్దామని అంటే వద్దన్నాడు. 'తగ్గిపోగానే ఎల్లిపోతాడు' అని నాతో చెప్పి ఆడిని మంచం మీద తొంగోపెట్టినాడు.

నా దగ్గరకొచ్చి – ఎవరితోనన్నా చెప్పావంటే తంతానన్నాడు. నే బయపడి అలాగేనన్నాను. నారాయణప్పని ఆడు అక్కడికి తీసుకొచ్చినట్లు మరోరికీ తెలియదు. నారాయణప్ప ఆరాత్రల్లా వుండి, ఆ మర్నాడు కూడుతినే ఏల సచ్చాడు. ఆ సంగతి సన్యాసి నాకు చెప్పలేదు. నన్నాడి దగ్గరకి ఎల్లనీలేదు. ఆడు వదలకుండా అక్కడ కూర్చున్నాడు. నాపని నేను చూసుకుంటున్నాను. రాత్రి ఎనిమిదవుద్ది. మళ్లీతిరిగొచ్చి చూసేసరికి అక్కడ సన్యాసి లేడు. నారాయణప్ప శవము లేదు. 'ఇదేటి సెప్మా' అని సూసేసరికి మా గొడ్ల

పాకలో ఏదో చప్పుడవుతోంటే ఎల్లి చూసేను. కాని తలుపు లేసి వున్నాయి. ఆ సీకట్లో ఏం కనబడలేదు.

మరి, ఆడేంచేశాడో యింతకన్నా నాకేం తెలీదు.''

సన్యాసి యింక తప్పదనుకొని యిలా చెప్పాడు :

''నారాయణప్ప ఆడిపెళ్లాన్ని ఆస్టేషనుమేస్టరికప్ప జెప్పి నా పెళ్ళాంమీద పడ్డాడు. ఈసంగతి నాకు తెలిసి, అదమాయించి నేమంచోణ్ణి కాదు, వదలుకో'' అని చెప్పేను. ఆడదీ ఇనుకోలేదు. ఆడిని ఎలాగైనా సఫా సెయ్యాలని బుద్ధి పుట్టింది. కాని ఆడికీ, ఎవరికీ అనుమానంలేకుండా సేసేదేదో సెయ్యాలని అనుకున్నా.

ఆరాత్రి తొమ్మిది దాటాక నారాయణప్ప బయలుదేరి ఆలైనుప్రక్క గోర్జిదగ్గిరికి యెల్లడం చూశాను. నేను యెనకే వెళ్ళాను. అప్పటికి ఆ మేస్టారూ, కాంతమ్మా రాలేదు. నారాయణప్ప ఆ దిబ్బప్రక్కనే దాక్కున్నాడు. నేనూ ప్రక్కనే తుప్పలో కూకున్నాను. కొంతసేపటికి ఆల్లిద్దరూ వచ్చారు. ఇంతలో మెరుపులా నారాయణప్ప లేచి ఆమేష్టరు తలకాయమీద కొట్టబోయినాడు. ఆ సమయంలోనే నాప్లానుప్రకారం నేను అంతకుముంచే తుప్పల్లోంచి నారాయణప్ప లేచీలేవగానే తలకాయమీద యిచ్చుగున్నాను. దాంతో ఆ డక్కడ పడిపోనాడు. కొట్టడం కొట్టేశానుగాని అక్కడుండటానికి భయమేసి పారిపోయాను!

నేనే టనుకున్నానంటే నారాయణప్పని కొట్టేస్తే చస్తే చస్తాడు. చచ్చినా ఆడిపెళ్ళానికీ ఓచను మాస్టారుకీ వుంది కాబట్టి ఆ కారణంచేత ఆ మేష్టగే కొట్టిఉంటాడని పోలీసులు

ఆడిమీద కే ఎలతారని అనుకున్నాను. అదీ నా ప్లాను. నేనలా పారిపోయినాను గాని, నాకు మళ్ళీ భయమేసింది. ఎందుకంటే ఒకేల ఆడు చస్తాడో లేదో ఆ ఒక్క దెబ్బతోనే చావకపోతే నేనే కొట్టానని చెప్పేస్తాడు. అప్పుడు న న్నట్టుకుంటారు అని భయమేసి తిరిగి అక్కడికొచ్చి నారాయణప్పని తీసుకొని ఇంటికి పోయేను. అక్క డాడు చచ్చాడు. ఆ సంగతి ఎవరికీ చెప్పకుండా ఆడి నెలాగయినా ఎక్కడైనా కామాపు సేసెయ్యాలని అనుకొన్నా ! ఎలాగ !_ ఆలోచిస్తే ఒక ఉపాయం తోసింది.

పీకకోసి పట్టాలమీద పడేస్తే - ఏ రైలుకిందో పడి ఉంటాడని అనుకుంటారుగదా, మరేచిక్కూ ఉండదని అనుకుని ఆ రాత్రికిరాత్రి మా గొడ్డపాకలోకి ఆ శవాన్ని మోసుకుపోయి పీక కోసేశా ! అప్పటికే సాలాసేపయి సచ్చినోడు కాబట్టి నెత్తురయినా లేదు! సొరకాయి తెగినట్టు సల్లగా తెంపేసి ఎరికీ అనుమానం ఎయ్యకండా బండిమీదపడేసి గడ్డి బాగా కప్పేశాను. కప్పేసి బండి తోలుకొని ఆలైను పక్కకొచ్చి లైనుమీద ఆడు కోరుండి పడినట్టే మొండెం, బుర్రా పడేసి చక్కావచ్చాను! ఇంత జాగ్రత్తగా చేసినా తస్సాదియ్యా! ఎలా తెలిసిందో ఏటో మరి !"

—o—